

అన్నదాన భవనానికి రూ.70 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి పువ్వుల నరసింహామూర్తి దంపతులు (రావులపాలెం) గురువారం రూ.70 వేల విరాళం సమర్పించారు.



అంతర్వేదిలో రూ.25 వేలు..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు ఎం.వెంకట కృష్ణారావు (హైదరాబాద్) గురువారం రూ.25 వేల విరాళం అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
43.0°/30.0°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	43.0	29.0
కాకినాడ	39.9	28.9
అమలాపురం	42.0	30.0

న్యూస్‌రీల్

భద్రత 'స్ట్రాంగ్' : ఎస్పీ శ్రీధర్




అమలాపురం టౌన్: చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపునకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 2 కిలోమీటర్ల మేర రెడ్ జోన్‌గా ప్రకటించారు. అదే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 2 కిలోమీటర్ల పరిధిలో గగనతలంలో అనధికార డ్రోన్స్‌తో చిత్రీకరణ కూడా నిషేధించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రెడ్ జోన్, నో ఫ్లయింగ్ జోన్‌ల అమలుకు భద్రతా సిబ్బంది పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ గురువారం సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఈ జోన్లు అమలులో ఉంటాయని చెప్పారు. ఎవరైనా జోన్‌ల ఆంక్షల అతిక్రమిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎస్పీ శ్రీధర్ హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం గురువారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎస్పీ జారీ చేసిన ఆదేశాల వివరాలను వెల్లడించింది. జిల్లాలో గురువారం కూడా క్యాసో తనిఖీలు, దాడులు విస్తృతంగా జరిగాయి. కాట్రేనికోన మండలం కుండలేశ్వరం గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (క్యాసో) తనిఖీలు నిర్వహించి రికార్డులు లేని 11 మోటారు సైకిళ్లను పోలీసు అధికారులు సీజ్ చేశారు. రావులపాలెం మండలం రావులపాడు గ్రామం, సఖినేటిపల్లి మండలం గొంది గ్రామాల్లో క్యాసో తనిఖీలు నిర్వహించారు. సీఐలు, ఎస్సైలు, నాయకులు,ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించి అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే ఈ సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు

అమలాపురం రూరల్: ఎస్‌కేబీఆర్ కళాశాల పూర్వ విద్యార్థులు కాలేజీలో సిల్క్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను పెంపొందించే ఉద్దేశంతో మూడు ముఖ్య నైపుణ్యాలలో శిక్షణకు గురువారం అంకురార్పణ చేశారు. జీఎస్ఏఏ సభ్యుడు డాక్టర్ పాలగుమ్మి వినాయక్ ఆధ్వర్యంలో ఒక భవనాన్ని స్కిల్ ప్రోగ్రామ్‌ల నిర్వహణకు పాలకమండలి అందించింది. పాలకమండలి అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు టెలీస్కిల్ ప్రోగ్రామ్ సెంటర్‌ను ప్రారంభించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు వెబ్‌సైట్‌ను, న్యాయవాది కె.మల్లపరాజు, కంప్యూటర్ కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు.

ధూమపానం... మృత్యు సోపానం



- హెచ్చరిస్తున్నా ఫలితం లేదు
- ఫ్యాషన్‌గా మొదలై.. వ్యసనంగా మారుతుంది
- పలు రకాల అనారోగ్యాలు
- లంగ్.. నోటి క్యాన్సర్ బారిన పడుతున్న సిగరెట్ ప్రియులు
- జిల్లాలో రోజుకు ఐదు లక్షలకు పైగా సిగరెట్లు.. చుట్టల వినియోగం
- నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

సాక్షి అమలాపురం: 'సరదా సరదా సిగిరెట్టూ... ఇది దొరల్ తాగు బల్ సిగిరెట్టూ..' రాముడు... భీముడు సినిమాలో ఒక హాస్యపాట. అప్పట్లో చాలా పాపులర్ అయ్యింది. కాని ఈ పాటలో సిగరెట్టు కాల్చడం వల్ల కలిగే మనసుకు కలిగే ఆనందం కన్నా.. దీనివల్ల కలిగే అనారోగ్యాన్ని కూడా కవి అద్భుతంగా వర్ణించారు. 'ఈ పొగ తోటీ గుప్పు గుప్పున మేఘాలు సృష్టించవచ్చు' అని సిగరెట్టు గురించి గొప్పగా చెబితే 'ఊపిరి తిత్తులు క్యాన్సరుకిదియే.. కారణమన్నారు డాక్టర్లు, పసరు బేరుకొని, కఫము జేరుకొని, ఉసురు తీయు పొమ్మన్నారూ' అని పాటలో హెచ్చరించారు. పాటలోనే కాదు.. కాల్చే సిగరెట్టు పెట్టిమీద.. పొగాకు ఉత్పత్తుల అమ్మే ప్యాకెట్ల మీద ఇది క్యాన్సర్ కారకమని హెచ్చరించినా ఫలితం కనిపించడం లేదు. యువకుల నుంచి వయో వృద్ధుల వరకు పొగాకు ఉత్పత్తుల బారినపడి అకాల మృత్యువాతకు గురవుతున్నారు. ప్రధానంగా యువత సిగరెట్లు.. పొగాకు ఉత్పత్తులతో వ్యసనాలు మొదలు పెడుతూ గంజాయి.. హెరాయిన్ వంటి భయంకరమైన మాదక ద్రవ్యాలకు సైతం బానిసలవుతున్నారు. ఒక విధంగా చెప్పాలంటే గంజాయి.. హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిస కావడానికి ధూమపానం తొలి మెట్టుగా మారుతోంది. 'మే 31వ తేదీ వరల్డ్ నో టుబాకో డే ' సందర్భంగా కథనం...

ఫ్యాషన్ మత్తులో కొందరు.. ఎంజాయ్ చేస్తున్నామనే భావనలో మరికొందరు... ధూమపానం ఒత్తిడి తగ్గిస్తుందని ఇంకొందరు భావిస్తున్నారు. జిల్లాలో యుక్త వయస్సు వచ్చిన వారి నుంచి వృద్ధుల వరకు పొగాకు ఉత్పత్తుల బారిన పడుతున్నారు. సిగరెట్స్, బీడి, హుక్కా, చిలుంలు ఆరోగ్యాన్ని పొగతో ఇబ్బంది పెడుతుండగా, ఖైనీ, గుట్కా, జర్దాలు పొగ లేకుండానే పొగపెడుతున్నాయి. గుట్కాను ప్రభుత్వం నిషేధించినా అక్కడక్కడా చాటుమాటు విక్రయాలు చేస్తున్నారు. ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కాలేజీల్లో కొత్తగా వీటిబారిన పడుతున్నవారు అధికంగా ఉంటున్నారు. ర్యాగింగ్ పేరుతో జూనియర్లకు వీటిని అలవాటు చేస్తున్న సీనియర్లు ఉన్నారు. జిల్లాలో రోజుకు ఐదు లక్షలకు పైగా సిగరెట్లు.. చుట్టలు వినియోగిస్తున్నట్టు అంచనా.

గుట్టుచప్పుడు కాకుండా గుట్కా అమ్మకాలు

గుట్కా, ఖైనీ, చుట్టా, బీడీ, సిగరెట్టు యువతకు ఫ్యాషన్‌గా మొదలై... వ్యసనంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల బాల కార్మికులు కూడా విపరీతంగా గుట్కాకు అలవాటు పడుతున్నారు. ప్రభుత్వం పొగాకు పదార్థాలు నిషేధించింది కానీ గుట్టు చప్పుడు కాకుండా గుట్కా అమ్మకాలు ఇంకా జోరుగానే సాగుతున్నాయి. ఒక సిగరెట్ తాగితే 11 నిమిషాల ఆయుష్షు తగ్గుతుంది. పొగ తాగే వారి ఇంట్లో ఉండడంతో కుటుంబ సభ్యులకు వ్యాధులు సోకే అవకాశం లేకపోలేదు.

మానేయడం అంత సులువుకాదు

- ధూమపానం మానేయడం అనేది మనం అనుకునేంత ఈజీ కాదు. ఎందుకంటే మీరు వెంటనే ధూమపానం మానేసినప్పుడు, మీరు ఆకలి, అలసట, తలనొప్పి, నిద్రలేమి, దగ్గు, మలబద్ధకం వంటి కొన్ని తాత్కాలిక సమస్యలను చూడాల్సి వస్తుంది. అయితే ఈ సమస్యలు కొంతకాలమే. వీటిని బూచిగా చూసి తిరిగి మొదలు పెడుతుంటారు. కొన్ని రోజులు మాత్రమే ఉంటాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- ధూమపానం చేయాలనే కోరిక 15 నుంచి 20 నిమిషాల వరకు ఉంటుంది. అంటే ఒకసారి సిగరెట్ తాగాలనే ఆలోచన వస్తే.. కొన్ని నిమిషాలు మాత్రమే దానిపైకి మనసు లాగుతుంది. సంగీతం వినడం, వీడియోలు చూడటం, పనిని కొనసాగించడం లేదా స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో మాట్లాడటం వంటివి చేస్తే ధూమపానం నుంచి దృష్టిని మరలించవచ్చు.

నిరంతరం అవగాహన



పొగతాగడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తున్నాం. దీనిపై జనసమ్మర్దం ఉన్న ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నాం. మత్తు పదార్థాలకు బానిసైన వారికి డీ అడిక్షన్ సెంటర్లలో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. నో టొబాకోడే సందర్భంగా అన్ని ఆస్పత్రుల వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశాం.

– డాక్టర్ జాన్ లెవి ఇంజేటి, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్‌సీడీ అండ్ ఆర్‌బీఎస్‌కే

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పబ్లిక్ ప్రదేశాల్లో గతేడాది 595 అవగాహన క్యాంపులు నిర్వహించాం. కళాశాలల్లో విద్యార్థులకు 15 చోట్ల అవగాహన సమావేశాలు నిర్వహించాం.

– కొల్లాటి ప్రమీల, సోషల్ వర్కర్, నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ)

పొగ చూరిపోతున్న ఆరోగ్యం

- సిగరెట్‌లో నికోటిన్‌తో పాటు హానికరమైన రసాయనాలు ఉంటాయి. బెంజోపైరీన్, అక్రోలిన్, నైట్రోసమైన్‌లు ఉన్నాయి. జిల్లాలో 58 మంది క్యాన్సర్ బారిన పడగా, వీరిలో 28 మంది లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వీరిలో అధిక శాతం మంది పొగాకు పీల్చడం, నమలడం వల్ల క్యాన్సర్ బారినపడినవారు ఉన్నారు. జిల్లాలో 29 శాతం మంది యువకులు సిగరెట్స్‌కి బానిసలుగా ఉన్నారు. వారికి 35 నుంచి 45 వయస్సు వచ్చే సరికి ఊపిరితిత్తులు, గుండె జబ్బులకు గురవుతున్నారని కొన్ని సర్వేలు చెబుతున్నాయి.
- పొగ పీల్చడంతో 4,000 రకాల రసాయనాలు శరీరంలోకి వెళుతున్నాయి. వీటిలో 43 రకాల క్యాన్సర్ కారకాలు 400 రకాల విష పదార్థాలు శరీరంలో చేరుతున్నాయి.
- పొగాకు ఉత్పత్తుల వల్ల లంగ్ క్యాన్సర్, తల, మెడ క్యాన్సర్, స్వర పేటిక, అన్నవాహిక, మూత్రాశయం, మూత్రపిండాలు, ప్యాంక్రియాస్, కడుపు క్యాన్సర్ వంటి అనేక రోగాలకు ధూమపానం ప్రధాన కారణం. ఇది రక్తనాళాల సంకుచితానికి కారణమవుతుంది. ఇది రక్త ప్రసరణ అడ్డంకికి దారితీస్తుంది. తద్వారా గుండెపోటు, లంగ్ క్యాన్సర్‌తో పాటు బ్రోన్కైటిస్, ఎంఫిసెమా, ఆస్తమా, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు పెరుగుతాయి.
- రెండేళ్ల పాటు మృత్యుఘోష వినిపించిన కరోనా వైరస్ వల్ల ఊపిరితిత్తులు దెబ్బతిని మృతి చెందినవారు అధికంగా ఉన్నారు. పొగ తాగడం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, గొంతు, నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదముంది.

మిగిలేది బూడిదే..



ధూమపానం అలవాటు అటు ఆర్థికంగాను.. ఇటు ఆరోగ్యపరంగాను మిగిలేది బూడిదే. నన్ను ఈ రోజు మీరు బూడిద చేస్తే...రానున్న రోజులలో మిమ్మల్ని నేనూ బూడిదలో కలిపేస్తాను అంటున్న సిగరెట్‌ను యువత ఫ్యాషన్‌గా అలవాటు చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో హైస్కూలు, టీనేజ్ స్థాయి నుంచే ఎక్కువ మంది ఆకర్షితులు అవుతున్నారు. దీనిని గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ధూమపానం వల్ల వచ్చే శారీరక, మానసిక ఆరోగ్యపరమైన అనర్థాల గురించి వారికి చెప్పాల్సి ఉంది.

– డాక్టర్ శ్రీపాద రామకృష్ణ, కౌన్సెలింగ్ సైకాలజిస్టు, బీవీసీ ఇంజినీరింగ్ కాలేజీ, ఓడలరేవు



ధూమపానానికి దూరం జరిగితే...

20 నిమిషాలు : రక్తపోటు, హృదయ స్పందన రేటు స్థిరీకరించబడుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

8 గంటలు : రక్తంలో నికోటిన్, కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు సగానికి తగ్గుతాయి. ఆక్సిజన్ స్థాయిలు సాధారణ స్థితికి వచ్చే స్థాయి. గుండెపోటు ప్రమాదం తగ్గడం ప్రారంభమవుతుంది.

12 గంటలు : రక్తంలో కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు సాధారణ స్థితికి వచ్చేస్తాయి.

24 గంటలు : కార్బన్ మోనాక్సైడ్ పూర్తిగా కరిగిపోతుంది. దగ్గు ద్వారా గొంతులో నుంచి కొన్ని వెళ్లిపోతాయి.

72 గంటలు : ఊపిరితిత్తులు ఇప్పుడు మరింత గాలిని పంపడం ప్రారంభిస్తాయి. శ్వాస తీసుకోవడం సులభంగా మారుతుంది.

1 నుంచి 2 వారాలు : ఊపిరితిత్తుల పనితీరు, రక్త ప్రసరణ మెరుగుపడుతుంది.

1 నెల : మెరుగైన రక్త ప్రసరణ జరుగుతుంది. చర్మాన్ని పోషిస్తుంది, ముడతలు రాకుండా చేస్తుంది.

1 సంవత్సరం : ధూమపానం చేసేవారితో పోలిస్తే గుండెపోటు వచ్చే ప్రమాదం సగానికి తగ్గిపోతుంది.

15 సంవత్సరాలు : గుండెపోటు వచ్చే ప్రమాదం ధూమపానం చేయనివారితో సమానంగా ఉంటుంది.

ఈసెట్‌లో మోడేకుర్రు విద్యార్థికి 3వ ర్యాంకు



ధనుంజయ కుమార్

కొత్తపేట: ఏపీ ఈసెట్ కెమికల్ బ్రాంచ్‌లో కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామానికి చెందిన గొలకోటి నితిన్‌రామ ధనుంజయకుమార్ 3వ ర్యాంకు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన గొలకోటి సత్తిబాబు, వరలక్ష్మి దంపతుల కుమారుడైన ధనుంజయకుమార్ కెమికల్ ఇంజినీర్ కావాలన్నది తన లక్ష్యమని తెలిపాడు.

వరప్రసాద్‌కు 7వ ర్యాంకు



అయినవిల్లి: ఎస్.మూలపాలెం ఎంపీఎం కళాశాల విద్యార్థి వి.వరప్రసాద్ 2024 ఈసెట్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగంలో 7వ ర్యాంకు సాధించినట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ జి.శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరప్రసాద్‌తో పాటు 12 మంది ఉత్తమ ర్యాంకులు సాధించారన్నారు.

అంగర విద్యార్థికి మణికంఠకు 10వ ర్యాంకు



కపిలేశ్వరపురం: మండలంలోని అంగరకు చెందిన అబ్బిశెట్టి భాస్కర మణికంఠ ఈ సెట్ ఫలితాల్లో 10వ ర్యాంకు సాధించాడు. కంప్యూటర్ సైన్స్‌లో డిప్లమా పూర్తి చేసిన మణికంఠ ఇంజినీరింగ్‌లో చేరిక కోసం ఈ సెట్ రాశాడు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడాలన్నది తన ఆశయమని మణికంఠ తెలిపారు.

ఓట్ల లెక్కింపు కీలకం

అమలాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ అత్యంత కీలకమని, ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ఈ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల శిక్షణ కేంద్రం నోడల్ అధికారి శివశంకర్ అన్నారు. ఓట్లను లెక్కించే సూపర్‌వైజర్లు, సహాయకులకు నోడల్ అధికారులకు అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో చివరి విడత అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పొరపాటుకు కూడా తావివ్వద్దని, ప్రతీ ఒక్కరూ ఎంతో అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 4వ తేదీ 7 గంటలకు స్ట్రాంగ్ రూములను పోటీలో ఉన్న అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో తెరుస్తామని తదుపరి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. సిబ్బంది ఉదయం ఐదున్నర గంటలకే తమకు కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఒకవైపు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు, మరోవైపు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమాంతరంగా జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లు అధిక సంఖ్యలో పోలైనందున, వాటి లెక్కింపు కోసం రెండు టేబుళ్లు ఏర్పాటు చేశామని చెప్పారు.ఓట్ల లెక్కింపు కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ శర్మ, డీటీ పలివెల అశోక్ ప్రసాద్ పాల్గొన్నారు.

చెండాడిన 'మే'ర్తాండుడు

- దారెత్తిస్తున్న రోహిణీ కార్తె ఎండలు
- రోళ్లు పగిలే స్థాయిలో నిప్పులు కురిపిస్తున్న సూర్యుడు
- అంబాజీపేటలో 41 డిగ్రీలు.. కనిష్ఠం 30 డిగ్రీలు
- ఆపై ఉక్కబోత... విలవిలలాడుతున్న సామాన్యులు



ఎండల తీవ్రతకు మధ్యాహ్నం మూడుగంటల సమయంలో కూడా బోసిపోయి కనిపిస్తున్న అంబాజీపేట సెంటర్

సాక్షి అమలాపురం: ఒకవైపు నైరుతి రుతుపవనాలు దేశంలో ప్రవేశించాయి. మరోవైపు వారం రోజుల క్రితం రెమాల్ తుపాను వల్ల రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షాలతో వాతావరణం చల్లబడిందని సామాన్యులు సంతోషించారు. ఈ సమయంలో రోహిణి కార్తె మొదలైంది. ఈ ఏడాది రోహిణి ప్రభావం పెద్దగా ఉండదని, సాధారణ ఎండలే కాస్తాయని వాతావరణ శాఖ అభిప్రాయపడింది. కాని రోహిణి కార్తె మొదలై రోజులు గడుస్తున్న కొద్దీ భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. గత రెండు రోజులుగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలతో జిల్లాలో నిప్పులు కురిపిస్తున్నాడు. మండుతున్న ఎండలు.. అధిక తేమ... వేడి గాలులు, వడగాడ్పులతో సామాన్యులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

గ్రామాల్లో సైతం కర్ఫ్యూ వాతావరణం

వేసవి మొదలైన తరువాత ఇప్పటి వరకు పెద్దగా ప్రభావం చూపని సూర్యుడు తన తీక్షణతను చూపిస్తున్నాడు. జిల్లాలో బుధ, గురు వారాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. జిల్లా కేంద్రమైన అమలాపురంలో గురువారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, అత్యధికంగా కొబ్బరి కేంద్రమైన అంబాజీపేట, మండపేటలో 41 డిగ్రీలు నమోదయ్యింది. ఉదయం పది దాటితే చాలు నిప్పులు కురిపిస్తున్న భానుడు తీవ్రతకు జనం జడిసిపోతున్నారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పట్టణాలతోపాటు గ్రామాలు సైతం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. సామాన్యులు, చిరు వ్యాపారులు అల్లాడిపోతున్నారు. రోడ్ల వెంబడి తోపుడు బండ్లు, చిన్నచిన్న దుకాణాలలో వ్యాపారాలు చేసుకునే వ్యాపారులు మధ్యాహ్న సమయంలో దుకాణాలు మూసివేస్తున్నారు. తిరిగి సాయంత్రం తెరుస్తున్నారు. సాయంత్రం నాలుగు తరువాతే వ్యాపారాలు మొదలవుతున్నాయని చిరు వ్యాపారులు చెబుతున్నారు.

రాత్రి పూటా వేడిగాలులు

కనిష్ఠ ఉష్ణోగ్రతలు సహితం 30 డిగ్రీలు చేరాయి. దీంతో రాత్రి అయినా వేడి గాలి వీడడం లేదు. ఫ్యాను కింద కూర్చున్నా సరే... వేడి గాలితో సామాన్యులు అల్లాడి పోతున్నారు. రాత్రి వేళ్లలో ఆరుబయట నిద్రపోతున్నా సరే ఉక్కబోత వీడక ఆపసోపాలు పడుతున్నారు. ఎండ తీక్షణానికి వేడి గాలి తోడు కావడంతో మధ్యాహ్న సమయంలో ఎక్కడ తలదాచుకోవాలో తెలియడం లేదని జనం వాపోతున్నారు. జిల్లాలో జూన్ 10వ తేదీ వరకు మధ్యలో ఒకటి, రెండు రోజులు మినహా ఇదే ఉష్ణోగ్రతలు ఉంటాయని జనం అంచనా. ఎండలకు విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. ఫ్యాన్లు, ఏసీలు ఉదయం, సాయంత్రం, రాత్రి అనే తేడా లేకుండా పనిచేస్తూనే ఉన్నాయి. పలుచోట్ల లోడ్ పెరిగి సాంకేతిక పరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఖరీఫ్ సన్నాహక సూచిక

సూర్యుడు రోహిణి నక్షత్రంలో ప్రవేశించడంతో రోహిణి కార్తె మొదలవుతుంది. సాధారణంగా మే 4వ వారంలో ఈ కార్తె మొదలవుతుంది. మొత్తం 15 రోజుల పాటు ప్రభావం ఉంటుంది. ఈ ఏడాది మే 25న మొదలైన కార్తె జూన్ 8వ తేదీ వరకు ఉండనుంది. రోహిణి ఎండలు ఎంతగా మండుతాయంటే రోళ్లు పగిలిపోతాయని జనం నమ్మకం. ఇది చాలాసార్లు రుజువైంది కూడా. రోహిణి కార్తె ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం కావాలని సూచిస్తోంది. విత్తనాలు సిద్ధం చేసుకోవడంతోపాటు సాగుకు సన్నాహాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

అగ్ని నక్షత్రంలో సూర్యుడి ప్రవేశం వల్లే



అగ్ని నక్షత్రం (కృతికా నక్షత్రం)లో మూడు, నాలుగు పాదాలు, రోహిణి మొదటి పాదంలో సూర్యుడున్నంతసేపు రోహిణి కార్తి ఉంటుంది. సూర్యుడు భూమికి దగ్గరగా వస్తాడు. దీనివల్ల వేడి ఎక్కువగా ఉంటుంది. అగ్నినక్షత్రంలో సూర్యుడి ప్రవేశం వల్ల ఈ కాలంలో అగ్ని ప్రమాదాలు అధికంగా జరుగుతాయి. ఈ ఎండలకు బలంగా ఉండే రోళ్లు కూడా పగులుతాయని పెద్దలు చెప్పారంటే ఎండ తీవ్రత ఎలా ఉంటోందనేది అప్పట్లోనే గుర్తించారు.

– ఉపద్రష్ట నాగాదిత్య, జోతిష్య కర్త, దైవజ్ఞ రత్న, అమలాపురం

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముగిసిన శిక్షణ

అమలాపురం టౌన్: జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ మూడు రోజులపాటు కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో జరిగింది. జిల్లాకు చెందిన ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు. ఆ మెడికల్ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, నోడల్ అధికారిణి డాక్టర్ రుక్మిణీదేవి ఆధ్వర్యంలో ఈ మూడు రోజుల శిక్షణ జరిగింది. రంగరాయ మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీఎస్ఎల్ నరసింహం అధ్యక్షతన గురువారం శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి మాట్లాడుతూ రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ల కోసం 30 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారందరినీ పరీక్షించాలని ప్రభుత్వం నిర్దేశించిందని వివరించారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్‌లకు రెండో స్థాయి శిక్షణ నిర్వహించామన్నారు.

వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు

అయినవిల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 2024 పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేసినట్టు ముక్తేశ్వరం వైఈఎస్ అండ్ బీఆర్ ఎం.కళాశాల ప్రిన్సిపాల్ కె.విశాల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 3న జరగాల్సిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జూన్6 తేదీకి మార్చినట్లు తెలిపారు. మే 31 నుంచి జూన్ 5 తేదీ వరకూ వెబ్ కౌన్సెలింగ్ ఆప్షన్స్ పెట్టుకోనేవారి షెడ్యూల్ జూన్ 7 నుంచి 10వ తేదీ వరకూ మార్చినట్టు తెలిపారు. సీట్లు ఎలాట్‌మెంట్ జూన్ 7కు బదులు 13కు మార్చామన్నారు. జూన్ 10 నుంచి 14వరకు ఇచ్చిన షెడ్యూల్‌ను జూన్ 14 నుంచి 19 తేదీ వరకూ మార్చినట్టు తెలిపారు. పాలిటెక్నిక్ ఫస్ట్ ఇయర్ క్లాసు వర్కును జూన్ 10 నుంచి 14కు మార్చినట్టు తెలిపారు.

క్లుప్తంగా

చెన్నైలో రైలు ఢీకొని తాళ్లరేవు యువతి మృతి


ధరణి సత్య (ఫైల్)

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు మాధవ రాయునిపేట గ్రామానికి చెందిన పిల్లి ధరణి సత్య(21) చెన్నైలో రైలు ఢీకొని బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ధరణి సత్య ఇంజినీరింగ్ పూర్తిచేసింది. చెన్నైలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇటీవలే ఉద్యోగం వచ్చింది. రోజు మాదిరిగానే డ్యూటీకి వెళ్లేందుకు రైలు ఎక్కే క్రమంలో హెడ్ ఫోన్ వింటూ ట్రాక్ దాటుతుండగా సూపర్ ఫాస్ట్ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో ధరణి సత్య అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తండ్రి ఏడుకొండలు వ్యవసాయం చేస్తున్నారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో ధరణి సత్య పెద్ద కుమార్తె. చిన్నప్పటి నుంచి బాగా చదవి మంచి ఉద్యోగం తెచ్చుకుంది. చేతికి అందివచ్చిన కుమార్తె అర్ధాంతరంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఈ దుర్ఘటనతో తాళ్లరేవులో విషాదఛాయలు అలుముకున్నాయి. ధరణి సత్య మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని తాళ్లరేవు తీసుకువస్తున్నారు.

శక్తిదాయిని.. ఆరోగ్యకారిణి

- పాలు సంపూర్ణాహారం
- పాడి రైతులు అధిక లాభాలు పొందే అవకాశం
- జిల్లాలో 2.29 లక్షల పశువులు
- సగటున నెలకు 37,338 మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి
- రేపు ప్రపంచ పాల దినోత్సవం





రాయవరం: పాలు సంపూర్ణాహారం అన్న విషయం అందరికీ తెలిసిందే. ఎదిగే పిల్లల ఎముకలు, పళ్లు, కండరాల అభివృద్ధికి పాలలో ఉన్న కాల్షియం ఉపయోగపడుతుంది. అన్ని పోషక పదార్థాలు ఉండడం వల్లనే పాలను సంపూర్ణ ఆహారంగా పిలుస్తారు. పాలలో ముఖ్యమైన విటమిన్లు, మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, ఆమ్లాలతో పాటుగా శరీరానికి అవసరమైన లవణాలు, కాల్షియం, మెగ్నీషియం, జింక్, పొటాషియం, వేక్టస్ ఉన్నాయి. పుట్టిన చిన్నారి కేవలం పాలతోనే ఆరోగ్యాన్ని పొందుతాడు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు ప్రతీ ఒక్కరికీ అవసరమైన వస్తువు పాలు. దేశంలో శ్వేత విప్లవానికి ఆద్యుడైన పి.జె.కురియన్ పుట్టిన రోజు జూన్ ఒకటో తేదీన ఏటా ప్రపంచ పాల దినోత్సవం జరుపుకుంటున్నాం.

పాలు తాగడం వల్ల కలిగే లాభాలు

రోజుకు అర లీటరు పాలు తాగితే ఒక రోజుకు సరిపడా కాల్షియం లభిస్తుంది. కొలెస్ట్రాల్, బరువు ఎక్కువ ఉన్నవారు తగు మోతాదులో మాత్రమే పాలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంత ప్రజలు స్వచ్ఛమైన పాలను సేవిస్తారు కాబట్టి పట్టణంలో ఉన్న ప్రజల కంటే ఆరోగ్యంగా ఉండి ఎక్కువ కాలం జీవిస్తారు. పచ్చిపాలలో అధికంగా పోషక విలువలు, కాల్షియం ఉన్నప్పటికీ కొన్ని రకాలైన సూక్ష్మజీవుల వల్ల వ్యాధులు సంక్రమిస్తాయి. అందుకే పచ్చి పాలను తాగడం మంచిది కాదు. గేదె పాలు, ఆవు పాలల్లో పోషక విలువల పరంగా తేడా లేనప్పటికీ గేదె పాలలో కొలెస్ట్రాల్ శాతం తక్కువ. మాంసకృత్తులు, ముఖ్యమైన లవణాలు, విటమిన్లు, వెన్న శాతం ఎక్కువగా ఉంటాయి కాబట్టి గేదెపాలు ఆవు పాల కంటే శ్రేయస్కరం.

పాలల్లో ఉండే పౌష్టికాహార పదార్థాలు

పౌష్టికాహార పదార్థాలు	ఆవుపాలు	గేదెపాలు	మేకపాలు
మాంసకృత్తులు	3.2	3.1	4.5
కొవ్వు పదార్థాలు	3.9	3.5	8.0
పిండి పదార్థాలు	4.8	4.4	4.9
శక్తి	66/275	60/258	110/463
సాట్యురేటెడ్ ఫ్లాట్ ఆమ్లాలు	2.4	2.3	4.3
నాన్ సాట్యురేటెడ్ ఫ్లాట్ ఆమ్లాలు	1.1	0.8	1.7
పోలీ అన్ సాట్యురేటెడ్ ఫ్లాట్ ఆమ్లాలు	0.1	0.1	0.2
కాల్షియం	120	100	195

వెన్నశాతం లీటరుకు ఇలా..

పదార్థం	ఆవు పాలు	గేదె పాలు
మజ్జిగ	13	19
వెన్న	14	22
నెయ్యి	18	27
పెరుగు	2.0	1.5
కోవ	5.0	6.0

మేకపాలు

ఆవుపాలు, మేకపాలు ఇంచుమించుగా సమానమే అయినప్పటికీ ఆవుపాల వల్ల చిన్నపిల్లల్లో వచ్చే అరుగుదల, ఎలర్జీ సమస్యల శాతం ఎక్కువ. మేక పాలు త్వరగా జీర్ణమై అతి తక్కువ ఎలర్జీ సమస్యలు వస్తాయి. లాక్టోస్ శాతం ఆవుపాలలో కంటే మేకపాలల్లో కొద్దిగా తక్కువ. అందుకే లాక్టోస్ సమస్యలు ఉన్న చిన్న పిల్లలకు ఆవుపాల కంటే మేక పాలు ఇవ్వడం మంచిది.

పాలతో తయారయ్యే పదార్థాలు

పాడితో రైతులు పలు విధాలుగా లాభాలు ఆర్జించవచ్చు. అధిక శాతం రైతులు కేవలం పాలను మాత్రమే డైరీలకు అమ్ముకుంటారు. పాలతో పాలకోవా, పన్నీరు, పెరుగు, మజ్జిగ, లస్సీ వంటి ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చు. పాలతో తయారు చేసే ఉత్పత్తులతో పాడి రైతులు లాభాలు ఆర్జించేందుకు అవకాశం ఉంది. స్వీట్‌స్టాల్స్‌లో తయారు చేసే పలు పదార్థాలకు నెయ్యిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో పాలతో తయారయ్యే ఉత్పత్తులకు డిమాండ్ ఉంది.

జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తెల్లజాతి పశువుల కన్నా నల్లజాతి పశువులు అధికంగా ఉన్నాయి. వీటిలో ముర్రా, సంకర ముర్రా జాతి పశువులు అధిక సంఖ్యలో ఉన్నాయి. జిల్లాలో 2.29 లక్షల పశువులు ఉండగా, వీటిలో 1,53,542 నల్లజాతి పశువులు(గేదెలు), తెల్ల జాతి పశువులు (ఆవులు) 75,460 ఉన్నాయి. ఆవుల్లో దేశీవాళీ ఆవుల కన్నా పాలు అధికంగా ఇచ్చే ఉత్తమ జాతి జెర్సీ, హెచ్ఎఫ్, ఓ-జెర్సీ వంటి సంకర జాతి ఆవులు ఉన్నాయి. గేదెల్లో అధికంగా హర్యానా, పంజాబ్ రాష్ట్రాల నుంచి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా దిగుమతి చేసుకున్న ముర్రా జాతి గేదెలు, ముర్రా జాతి వీర్యంతో దేశీయ గేదెలతో సంకర పర్చడం ద్వారా పుట్టిన అప్‌గ్రేడెడ్ ముర్రా జాతి గేదెలు అధిక సంఖ్యలో ఉన్నాయి. సంఖ్యాపరంగా తక్కువ ఉన్నా అధిక పాల ఉత్పత్తి కలిగిన పశువులు అధికంగా ఉండడం వలన ఇతర జిల్లాలతో పోలిస్తే పాల ఉత్పత్తిలో రాష్ట్రంలో కోనసీమ ముందడుగులో ఉంది. టోటల్ మిక్స్‌డ్ రేషన్(టీఎంఆర్)ను రాష్ట్రంలోనే అత్యధికంగా మన జిల్లాలోనే అధికంగా 80 శాతం సబ్సిడీపై పాడి రైతులకు సరఫరా చేశారు. ప్రతి సంవత్సరం వరదల సమయంలో ఉచితంగా టీఎంఆర్‌ను పాడి రైతులకు సరఫరా చేస్తారు. గత రెండేళ్లలో సుమారు రూ.2.5 కోట్ల విలువైన టీఎంఆర్‌ను పాడి రైతులకు వరద సమయంలో ఉచితంగా పశు సంవర్ధక శాఖ ద్వారా సరఫరా చేశారు. టీఎంఆర్ పశువులకు దాణాగా ఇవ్వడం వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. సమయానుకూలంగా వ్యాధి నిరోధక టీకాలను పశువులకు అందించడం, పశువిజ్ఞాన బడి కార్యక్రమం ద్వారా పాడి రైతులకు మెరుగైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇవ్వడం వలన రైతుల్లో అవగాహన పెరిగి పాల ఉత్పత్తులు పెరిగాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిమేత కొరత లేకుండా ఉండేందుకు పచ్చిమేత సాగుకు సబ్సిడీపై గడ్డి విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేసింది. ఇది కూడా మెరుగైన పాల ఉత్పత్తికి దోహదపడింది.


పాలు పితుకుతున్న రైతు



పాల ఉత్పత్తిలో జిల్లా ముందంజ



జిల్లాలో పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోనే కోనసీమ జిల్లా పాల ఉత్పత్తిలో ముందంజలో ఉంది. పాడి అభివృద్ధికి రైతులు కూడా తగిన శ్రద్ధ తీసుకుంటున్నారు. పాడి రైతులు యాజమాన్య పద్ధతులను ఎప్పటికప్పుడు అవలంబిస్తున్నారు. టీఎంఆర్ వినియోగానికి, పచ్చగడ్డికి పెంపుదలకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు.

– డాక్టర్ కర్నీడి మూర్తి, డిప్యూటీ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అమలాపురం

సంపూర్ణ ఆహారం



పాలు ఎప్పటికీ సంపూర్ణ ఆహారంగా పరిగణించవచ్చు. ఎముకుల దృఢత్వానికి పాలు ఉపకరిస్తాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ పాలను ఆహారంగా తీసుకోవచ్చు. మెనోపాజ్ సమయంలో హార్మోన్స్ తగ్గుదల ఉంటుంది. ఆ సమయంలో మహిళలు పాలు అధికంగా తీసుకోవాలి. వృద్ధాప్య సమయంలో ఎముకలు బలహీన పడతాయి. ఆ సమయంలో వృద్ధులు తప్పనిసరిగా పాలను తీసుకోవాలి. పాల వినియోగంపై మరింత అవగాహన పెరగాలి.

– డాక్టర్ వి.అనిరుధ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

ఒకటి నుంచి ఖరీఫ్‌కు సాగు నీరు


ఆర్.సతీష్‌కుమార్

ధవళేశ్వరం: గోదావరి డెల్టాకు సంబంధించి జూన్ 1 నుంచి ఖరీఫ్‌కు సాగు నీరు విడుదల చేయనున్నట్టు గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్ తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు నీరు విడుదల చేయనున్నామన్నారు. ఉదయం 10.30 గంటలకు నీరు విడుదల చేస్తామని సతీష్‌కుమార్ వెల్లడించారు. రబీకి ఈ నెల 10వ తేదీన నీటి విడుదలను నిలిపివేశారు. 21 రోజుల అనంతరం ఖరీఫ్‌కు నీరు విడుదల చేయనున్నారు. గురువారం కాటన్ బ్యారేజీ నుంచి 5,381 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు.

చిందాడగరువులో చోరీ


ఇంటి బయట దొంగలు పడేసిన బీరువా సొరుగులు

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం చిందాడగరువు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆ గ్రామానికి చెందిన కుంచే గోపి ఇంట్లో జరిగిన ఈ చోరీలో దొంగలు రూ.50 వేల విలువైన బంగారు గొలుసును తస్కరించారు. వేసవి కాలంలో కావడంతో గాలి కోసం ఇంటి తలుపులు తెరిచి కుటుంబీకులు నిద్రిస్తున్న సమయంలో దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలోని బంగారు గొలుసును కాజేశారు. గోపి ఇంట్లోనే కాకుండా పక్క ఇంట్లో కూడా దొంగలు దోపిడీకి విఫలయత్నం చేశారు. గోపి ఇంట్లో బీరువాలోని సొరుగులు ఇంటి ఆరు బయటకు తీసుకుని వచ్చి పడేశారు. అలాగే చోరీకి పాల్పడిన గదిలో వస్తువులన్నీ చిందర వందరగా పడేశారు. బంగారు నగతో పాటు ఇంకేమైనా సొత్తు దొరుకుతుందేమోనని దొంగలు ప్రయత్నించినట్టు చోరీ ప్రదేశాన్ని పరిశీలించిన అమలాపురం పట్టణ పోలీసులు భావిస్తున్నారు. గురువారం తెల్లారగానే గోపి కుటుంబీకులు తమ ఇంట్లో చోరీ జరిగినట్టు గుర్తించి ఆ సమాచారాన్ని తక్షణమే పట్టణ పోలీసులకు అందించారు. బాధితుడు గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ కె.కృష్టోఫర్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


లక్ష్మీకుమారి మృతదేహం

కె.గంగవరం: మండలంలోని ఊడిమూడికి చెందిన వివాహిత కోటిపల్లి లక్ష్మీకుమారి (42) బుధవారం తన ఇంటిలో ఉరిపోసుకుని మృతి చెందింది. కె.గంగవరం ఎస్సై జానీబాషా గురువారం తెలిపిన కథనం ప్రకారం... మృతురాలు లక్ష్మీకుమారికి జ్ఞాన శంకర్‌తో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తల మధ్య కొంతకాలంగా మనస్పర్థలున్నాయి. ఘటనా స్థలాన్ని సీఐ పి.దొరరాజు పరిశీలించారు. మృతురాలి తండ్రి సలాది సత్తిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


రమేష్ మృతదేహం

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరులో గురువారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కోరుకొండ ఎస్సై డి.ఆనందకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన బాదంపూడి రమేష్ (35) గుమ్ములూరులోని చిన్న సత్యవతిని పెండ్లి చేసుకుని, అత్తారింటికి వచ్చేసి వేరే ఇంట్లో కాపురం ఉంటున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య తలెత్తాయి. భర్త తాగుడికి బానిసై, కుటుంబ పోషణ పట్టించుకోవడంలేదని భార్య సత్యవతి ఇటీవల నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స అనంతరం ఇటీవల ఇంటికొచ్చి, అమ్మగారింటి వద్దనే ఉంటోంది. దీంతో రమేష్ మాత్రమే ఇంట్లో ఉంటున్నాడు. మధ్యాహ్నం 12 గంటలకు మృతుడి కుమారుడు గణేష్ తన తండ్రిని చూడడానికి వచ్చాడు. ఇంట్లో వేలాడుతున్న మృతదేహాన్ని చూసి తల్లికి చెప్పాడు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని కిందికి దింపి, పోలీసులకు తెలియజేశారు. కోరుకొండ పోలీసు స్టేషన్ ఎస్సై ఆనందకుమార్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై విలేకరులతో మాట్లాడుతూ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించామన్నారు. మృతుడికి 13 సంవత్సరాల వయసు గల కుమారుడు గణేష్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

యానిమేటర్

- రూ.43 లక్షలు స్వాహా
- పోలీసులకు ఫిర్యాదు
- డీఆర్‌డీఏ అధికారుల విచారణ


కడలిలో బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న బాధిత డ్వాక్రా మహిళలు

రాజోలు: డ్వాక్రా మహిళల పొదుపు సొమ్ముతో పాటు, స్త్రీనిధి సొమ్ము బ్యాంకులో జమ చేస్తానని మాయమాటలు చెప్పి కడలి గ్రామానికి చెందిన యానిమేటర్ రూ.43 లక్షలు స్వాహా చేసింది. ఈ మేరకు మండల సమాఖ్య అధ్యక్షురాలు దుర్గాభవానీ, ఏపీఎం ఏస్తేరులీల జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రాజోలు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కడలి బ్యాంకుకు సంబంధించిన నగదు జమ చేసుకునే విధంగా యానిమేటర్ దుర్గాభవానీకి బ్యాంక్ సర్వీస్ పాయింట్ ఇవ్వడంతో ఆ పాయింట్ ద్వారానే డ్వాక్రా మహిళలు నగదును జమ చేసేవారు. అయితే డ్వాక్రా మహిళల సొమ్ము జమ చేయకుండా యానిమేటర్ సొంత అవసరాలకు వాడుకునేదని, డ్వాక్రా మహిళలు ఆరోపించారు. బ్యాంకు అధికారుల అండతోనే యానిమేటర్ నగదు సక్రమంగా జమ చేసేది కాదని డ్వాక్రా మహిళలు బ్యాంకు వద్ద ఆందోళన చేశారు. యానిమేటర్, బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. కడలి గ్రామసమాఖ్య సంఘం 6వ నంబరు యానిమేటర్ అడబాల దుర్గాభవానీ పరిధిలోని 37 డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన పొదుపు, డ్వాక్రా రుణం, స్త్రీనిధి రుణానికి సంబంధించిన నెలనెలా వాయిదాలను బ్యాంకునకు జమ చేస్తూండేది. ఈ క్రమంలో ఒక్కొక్క నెలలో కొన్ని వాయిదాల సొమ్ము బ్యాంకులో జమ చేయకుండా తన సొంత అవసరాలకు వాడుకునేదని డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. ప్రతి నెలా వాయిదాలు సక్రమంగా బ్యాంకునకు చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులకు అనుమానం వచ్చి డ్వాక్రా సంఘాల ప్రతినిధులను నేరుగా సంప్రదించడంతో యానిమేటర్ సొమ్ము వాడేసుకున్నట్టు గుర్తించారు. దీంతో లబోదిబోమని డ్వాక్రా సంఘాల మహిళలు మండల సమాఖ్యకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేయగా 17 సంఘాలకు సంబంధించి రూ.43.43 లక్షల సొమ్ము తేడా వచ్చిందని ఏపీఎం ఏస్తేరులీల తెలిపారు. ఇంకా మిగిలిన సంఘాలకు సంబంధించి విచారణ చేయాల్సి ఉందన్నారు. రెండు రోజుల విచారణకు యానిమేటర్ దుర్గాభవానీ హాజరయ్యారని, ఈ నెల 30 జరిగిన విచారణకు హాజరు కాకపోవడంతోపాటు ఆమె సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారైనట్టు గుర్తించామన్నారు. దీంతో మండల సమాఖ్య ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

లక్ష్యంపై గురి ఉండాలి

- సివిల్స్ ర్యాంకర్ శ్రీజశ్వంత్ చంద్ర
- కాకినాడలో కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో సన్మానం


శ్రీజశ్వంత్‌చంద్రను సన్మానిస్తున్న ఆంధ్రా కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు ఏసుదాసు, మాజీ మంత్రి చిక్కాల

కాకినాడ రూరల్: జీవితంలో ఏదైనా సాధించవచ్చని, అందుకు కృషి, పట్టుదల ఉండాలని, అన్నింటికి మించి లక్ష్యంపై గురి ఉండాలని 2023 సివిల్స్ ర్యాంకర్ జీను శ్రీజశ్వంత్ చంద్ర పేర్కొన్నారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌లో 162వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైన జగ్గంపేటకు చెందిన శ్రీజశ్వంత్ చంద్రను గురువారం కాకినాడలోని శుభం కాపు కల్యాణ మంటపంలో ఆంధ్రా కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీజశ్వంత్ చంద్ర మాట్లాడుతూ తాను కాకినాడ ఆశ్రమ పబ్లిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్యను, హైదరాబాద్ నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేశానని, జేఈఈ మెయిన్స్‌లో 52వ ర్యాంక్, అడ్వాన్స్‌లో ఆల్ ఇండియా లెవెల్‌లో 173వ ర్యాంకు సాధించినట్టు చెప్పారు. కాన్పూర్ ఐఐటీలో బీటెక్ పూర్తి చేయగా క్యాంపస్ సెలెక్షన్స్‌లో విజయం సాధించి సామ్‌సంగ్ కంపెనీలో ఉద్యోగిగా చేరానన్నారు. తన తండ్రి మాణిక్యాలరావు, తల్లి అన్నపూర్ణ, తాత రంగరాయ కళాశాల విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ గొల్లపల్లి లక్ష్మణరావు, కుటుంబ సభ్యుల సహకారం, ప్రోత్సాహంతో ఐఏఎస్ అవ్వాలనే కలను చేరుకునే ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్నానన్నారు. సివిల్స్‌లో తొలి ప్రయత్నంగా 314 ర్యాంక్‌తో ఇండియన్ పోస్టల్ సర్వీస్‌కు ఎంపిక అయి, సామ్‌సంగ్‌లో జాబ్‌కు రిజైన్ చేసి పోస్టల్ జాబ్‌లో చేరానన్నారు. అక్కడితో ఆగక 2022లో ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్‌కు సెలెక్ట్ అయ్యానని, 2023లో 162వ ర్యాంక్‌తో ఐపీఎస్‌కు సెలెక్ట్ అయ్యానని, తన లక్ష్యం మాత్రం ఐఏఎస్ అని చెప్పుకొచ్చారు. శ్రీజశ్వంత్ మాటలు స్ఫూర్తిదాయకంగా ఉండడంతో అందరూ శ్రద్ధగా ఆలకించారు. ఆంధ్రా కాపు సద్భావన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసురెడ్డి ఏసుదాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు పాల్గొని శ్రీజశ్వంత్‌ను ఆదర్శంగా తీసుకోవాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో శ్రీజశ్వంత్ తాత లక్ష్మణరావు, కుటుంబ సభ్యులు, కాపు సంఘ నేతలు బసవా ప్రభాకరరావు, అడపా ప్రకాష్‌నాయుడు, శేతు మాధవరావు, సలాది మూర్తి, కనపర్తి నూకరాజు, అడ్డాల శ్రీలక్ష్మి, అడబాల సత్యనారాయణ, దామిశెట్టి శ్రీనివాస్, కృష్ణమోహన్, రంగనాయకులు పాల్గొన్నారు.

దాబాల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

- లైసెన్సులు లేకుండా నిర్వహణ
- వండిన, వండని మాంసం నిల్వతోపాటు టేస్టింగ్ సాల్ట్ వినియోగం
- నమూనాలు సేకరించి కేసు నమోదు


దాబాలో నిల్వ ఉంచిన మాంసం నమూనాలు సేకరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

తొండంగి: కల్తీ ఆహారం, జంక్ ఫుడ్‌ల కారణంగా ప్రజలు రోగాల బారిన పడకుండా ఏపీ వైద్యారోగ్యశాఖ ఫుడ్‌సేఫ్టీ అధికారులు విస్తృతంగా రెస్టారెంట్లు, దాబాల్లో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నారు. గురువారం బెండపూడి శివారు కోకిలా దాబాలో కాకినాడ ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ కొత్ర వెంకట సుబ్బారావు, ఇతర అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. దాబాలో అపరిశుభ్రంగా ఉన్న ఫ్రీజర్‌లో వండిన కోడి మాంసంతో పాటు దీర్ఘకాలంగా నిల్వ ఉంచిన మాంసం, దమ్ము బిర్యానీలో ప్రత్యేకంగా తీసిన చికెన్ ముక్కలను గుర్తించారు. నిల్వ ఉన్న వంటకాలను కూడా ఫ్రీజర్‌లో గుర్తించారు. వంటకు వినియోగించిన, అనేకసార్లు మరిగించిన ఆయిల్‌తోపాటు టేస్టింగ్ సాల్ట్ (మోనోసోడియం గ్లూటమేట్) వినియోగిస్తుండటాన్ని గుర్తించారు. వాటి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వెంకట సుబ్బారావు మాట్లాడుతూ తమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హైవేలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న దాబాలు, రెస్టారెంట్లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే విధంగా ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడాన్ని గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. ముఖ్యంగా బెండపూడి, అన్నవరం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న హోటళ్లలో ఫుడ్ లైసెన్స్, పంచాయతీ అనుమతులు కూడా లేవన్నారు. తక్షణమే హోటల్, దాబా యజమానులకు నోటీసులు జారీ చేసి లైసెన్స్ పొందడంతోపాటు పరిశుభ్రత, నిషేధిత రంగులు, టేస్టింగ్ సాల్ట్ వినియోగించకుండా ఆహార పదార్థాలు వినియోగదారులకు విక్రయించాలన్నారు. ప్రమాణాలు పాటించని హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లను సీజ్ చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.